వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

అప్రమత్తంగా ఉండాలి

- జిల్లాల్లోని మేధావులు, సీనియర్ సిటిజన్స్‌తో కన్సల్టేషన్ వర్క్‌షాప్ నిర్వహించి రెవెన్యూ యాక్ట్‌పై అభిప్రాయాలు సేకరించాలి
- రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ఎల్ఆర్ఎస్, ధరణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఉన్నతాధికారులు

రంగారెడ్డి, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ): రానున్న ఐదు రోజులు భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లతో భారీ, అతి భారీ వర్షాలు, ధరణిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న 5 రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండడంతో పాటు, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని.. ముఖ్యంగా ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని, ఎక్కడైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, స్థానిక పరిస్థితుల ఆధారంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడం లేదా నడిపించడం చేయాలని సూచించారు.

జిల్లా స్థాయిల్లో 23, 24 తేదీల్లో వర్క్‌షాప్

ప్రస్తుత రెవెన్యూ చట్టంలో మార్పులతో తీసుకురానున్న కొత్త రెవెన్యూ చట్టంపై ఈ నెల 23, 24 తేదీల్లో జిల్లా స్థాయిలో వర్క్ షాప్ నిర్వహించి మేధావులు, సీనియర్ సిటిజన్ల అభిప్రాయాలను తీసుకొని రాష్ట్ర స్థాయికి పంపించాలని మంత్రి పొంగులేటి కోరారు. ధరణి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, జిల్లా కలెక్టర్లు పెండింగ్‌లో ఉన్న అన్ని ధరణి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతం చేయాలని, గతంలో ఏవైనా డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయనట్లయితే ఇప్పుడు అలాంటి వాటిని గుర్తించి అప్‌లోడ్ చేయించాలని మంత్రి పేర్కొన్నారు.

హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురిసేందుకు ఆస్కారం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సాగునీటి ట్యాంకులు, చెరువులు, కుంటల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాగులు, వంకలు, కల్వర్టులు పొంగి ప్రవహిస్తున్న చోట ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అవసరమైతే ట్రాఫిక్‌ను మళ్లించాలని ఆమె తెలిపారు.

నష్టం జరుగకుండా చర్యలు

జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలోని ప్రజలకు, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని.. ఎక్కడ చిన్న సమస్య వచ్చినా పరిష్కరించేందుకు బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్‌రెడ్డి, రెవెన్యూ, ట్రాన్స్‌కో, సంబంధిత అధికారులున్నారు.

అభిప్రాయాలను సేకరించాలి

వికారాబాద్ : వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేయబోయే రెవెన్యూ యాక్ట్‌పై రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో 23 (లేదా) 24 తేదీల్లో జిల్లాస్థాయిలో మేధావులు, సీనియర్ సిటిజన్స్, సీనియర్ అధికారులతో కన్సల్టేషన్ వర్క్ షాప్‌ను నిర్వహించి, వారి అభిప్రాయాలను సేకరించాలని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఆర్ఎస్, ధరణి దరఖాస్తులు అధిక శాతం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి అర్హత గల దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఆమోదించాలన్నారు. ప్రత్యేక బృందాలను నియమించి రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, సంబంధిత సిబ్బంది ద్వారా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి, సరైన వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రెవెన్యూ, ఎల్ఆర్ఎస్‌లకు సంబంధించి జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని మంత్రి కోరారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు, ఉన్నతాధికారులు, ఆర్డీవోలు

అధికారులకు దిశానిర్దేశం

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరుగకుండా అధికార యంత్రాంగమంతా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్‌పై ఆర్ఐలు, ఎంపీవోలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని, ఈ నెల 23న మేధావులు, తహసీల్దార్‌లు, ఆర్డీవోలు, సీనియర్ అధికారులతో రెవెన్యూ యాక్ట్‌పై కన్సల్టేషన్ వర్క్ షాప్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ధరణి దరఖాస్తుల్లో వివిధ మాడ్యూల్స్(డేటా కరెక్షన్స్, సక్సెషన్, మ్యుటేషన్, టీఎం 33)లలో పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) సుధీర్, (రెవెన్యూ) లింగ్యానాయక్, వికారాబాద్, తాండూరు ఆర్డీవోలు వాసుచంద్ర, శ్రీనివాస్, ఎలక్ట్రిసిటీ ఎస్ఈ సంజీవరెడ్డి, ఇరిగేషన్ ఈఈ సుందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచుతామని మాట తప్పిన రేవంత్

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య

సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

యాచారం, ఆగస్టు 20 : పింఛన్ పెంచుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు దాటినా పింఛన్ పెంచకపోవడం ఎంతో సిగ్గుచేటని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. మండల కేంద్రంలోని దివ్యాంగుల భవనంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భూమి ఉన్నవారిపై ఉన్న ప్రేమ.. ఎలాంటి ఆధారంలేని ఆసరా పింఛన్‌దారులపై సీఎం రేవంత్‌కు లేదని ధ్వజమెత్తారు. పింఛన్ పెంపుపై సెప్టెంబర్ 20న యాచారంలో ఐదువేల మంది దివ్యాంగులతో ఆసరా పింఛన్‌దారుల ఆవేదన సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. పింఛన్ పెంచే వరకు రేవంత్ సర్కారును వదిలేదిలేదని హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దివ్యాంగులకు సంబంధించిన ఒక్క ఓటు పడకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. దివ్యాంగుల పట్ల అనుచిత వాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారినిపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. మలక్‌పేట అంధ విద్యార్థుల హాస్టల్‌లో 8 ఏండ్ల చిన్నారిపై అత్యాచారం జరిగినా ప్రభుత్వం చీమ కుట్టినట్లు కూడా స్పందించకపోవడం ఎంతో దారుణమన్నారు. ఆగస్టు 20న వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ సభను మండలంలో వైభవంగా జరుపుకోవాలన్నారు. గ్రామగ్రామాన వీహెచ్‌పీఎస్ జెండాలను ఆవిష్కరించి మండల కేంద్రంలో సభను నిర్వహించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పరిగి, ఆగస్టు 20 : సీఎస్‌సీ హెల్త్‌కేర్ అండ్ వెల్‌నెస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలవారీగా ప్లెబోటోమిస్ట్, సపోర్టింగ్ స్టాఫ్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీఎస్‌సీ హెల్త్‌కేర్ అండ్ వెల్‌నెస్ జిల్లా కో-ఆర్డినేటర్ విష్ణువర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్లెబోటోమిస్ట్ పోస్టుకు ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, బీఎస్సీ ఎంఎల్‌టీ, సపోర్టింగ్ స్టాఫ్ నర్సింగ్(ఎఎన్ఎం, జీఎన్ఎం) లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. పార్ట్‌టైమ్ నెలకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు, ఫుల్‌టైం నెలకు రూ.50వేల నుంచి రూ.60వేల వరకు వేతనం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. పరిగిలోని అంకిత స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఈ నెల 21 బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. వివరాలకు 9642160223, 9550421183లను సంప్రదించాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, ఆగస్టు 20 : కొడంగల్ నియోజకవర్గ పరిధిలో కడా కింద మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కడా కార్యాలయంలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి వికారాబాద్, నారాయణపేట జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన ఆయా శాఖల అధికారులు ప్రత్యేకంగా శ్రద్ధ వహించి పనులను ప్రాధాన్యతాక్రమంలో పూర్తి చేయాలని సూచించారు. మంజూరైన అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియలను వేగవంతంగా చేపట్టి పనులు ప్రారంభించాలని తెలిపారు. రోడ్డు విస్తరణ, రోడ్డు బలోపేతం వంటి పనులకు సంబంధించి ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉందన్నారు. వివిధ కళాశాలల నిర్మాణాల నిమిత్తం భూసేకరణ చేపట్టాలని, భూ సేకరణలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ప్రతిపాదనలు సమర్పించాలి

కొడంగల్ సీహెచ్‌సీ ఆసుపత్రిలో ఆసుపత్రి భవన నిర్మాణాల సమూనాల ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటింటికీ మిషన్ భగీరథ నీటి సరఫరా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, నీటి ట్యాంకుల నిర్మాణాలు, పైప్‌లైన్ పనుల నిమిత్తం ప్రతిపాదనలు పంపాలని సూచించారు. రోడ్డపై గుంతలు లేకుండా ప్యాచ్ పనులు చేపట్టాలని తెలిపారు. ప్రతి వారం నిర్వహించే సమీక్షా సమావేశంలో పనుల పురోగతిపై తెలియజేయాలన్నారు. మన ఊరు, మన బడి కింద చేపట్టిన పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం స్థానిక తసీల్దార కార్యాలయాన్ని సందర్శించి భవన పరిస్థితులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, భద్రత, సిబ్బంది విధులను తదితర అంశాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తలు, ప్రజలకు అండగా ఉంటా

- హామీల అమలు కోసం ప్రభుత్వంపై పోరాటం
- ఎంపీ డీకే అరుణ

బొంరాస్‌పేటలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

బొంరాస్‌పేట, ఆగస్టు 20 : అధికార పార్టీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా తనను గెలిపించిన కార్యకర్తలు, ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మంగళవారం బొంరాస్‌పేటలో నిర్వహించిన మండలస్థాయి కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో తన ఓటమికి కాంగ్రెస్ పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా కార్యకర్తలు తిప్పికొట్టారన్నారు. బీఆర్ఎస్‌పై ఉన్న కోపంతోనే ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారు తప్ప ఆ పార్టీపై ప్రేమతో కాదన్నారు. ప్రతిపక్షాలను బెదిరించి లొంగదీసుకోవాలని అధికార పార్టీ ప్రయతిస్తున్నదని, బెదిరింపులకు లొంగే తత్వం తెలంగాణ ప్రజలకు లేదని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటి కూడా నెరవేర్చ లేదని అరుణ విమర్శించారు. చాలా తక్కువ మంది రైతులకు రుణ మాఫీ జరిగిందని, హామీల అమలుపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా వాలిపోతానని హామీ ఇచ్చారు. వచ్చే నెల 1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందని, ఇంటింటికీ తిరిగి పార్టీలో సభ్యత్వం చేయించి పార్టీని పటిష్టం చేయాలని అరుణ పిలుపునిచ్చారు. వివిధ సమస్యలపై కార్యకర్తలు అరుణకు వినతిపత్రం అందించారు. కార్యకర్తలు, నాయకులు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పున్నంచంద్‌లాహోటీ, ప్రతాప్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రావణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహించాలి

జిల్లా వైద్యాధికారి డా.వెంకటేశ్వర్‌రావు

తిమ్మాపూర్‌లో హెల్త్ క్యాంపును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కొత్తూరు, ఆగస్టు 20 : డెంగీ పాజిటివ్ వచ్చిన పరిసర ప్రాంతాల్లో 100 ఇండ్ల వరకు ఇంటింటికీ ఫీవర్ సర్వే నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. కొత్తూరు మున్సిపాలిటీలోని తిమ్మాపూర్‌లో డెంగీతో ఓ వ్యక్తి మరణించిన నేపథ్యంలో మంగళవారం మండల వైద్యాధికారి హరికిషన్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తిమ్మాపూర్‌లో విష జ్వరాలు వస్తున్నందున మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామని తెలిపారు. ఏ ఏరియాలో ఎక్కువ విష జ్వరాలు వస్తే ఆ ప్రాంతంలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే జ్వరం వచ్చిన ఇండ్లలో, గుట్టుపక్కల పైరిత్రం స్ప్రే చేయించాలన్నారు. దీంతోపాటు మున్సిపల్ కమిషనర్‌తో కోఆర్డినేట్ చేసుకొని ప్రతిరోజూ తిమ్మాపూర్‌లో ఫాగింగ్ చేయించాలన్నారు. జ్వరం వచ్చినవారి రక్త నమూనాలను సేకరించాలన్నారు. డెంగీ పరీక్ష నిర్ధారణ కోసం శాంపిల్స్‌ను కొండాపూర్ ఆస్పత్రికి పంపించాలన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, వైద్యాధికారులు ఉదయకిరణ్, డా.రామ్‌నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, సీహెచ్‌వో నాగేశ్, ఏఎల్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల కొత్త మోసాలు

సిటీబ్యూరో, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త తరహా మోసానికి తెరలేపుతున్నారు. ఇటీవల ప్రతి గంటకు ఒక కొత్త నంబర్‌తో ఫోన్ కాల్స్ వస్తున్నాయి. అందులో డ్రగ్స్ స్మగ్లింగ్‌తో పాటు మీకు ఇన్సూరెన్స్ కావాలా.? అంటూ.. రకరకాల కారణాలు చెబుతూ కాల్స్ చేస్తున్నారు. పూర్తి వివరాలకు 9 నంబర్ నొక్కాలంటూ సూచిస్తున్నారు. ఏకంగా కాల్ సెంటర్‌నే నిర్వహిస్తూ అందినకాడికి అమాయకుల నుంచి దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు కుట్రలు పన్నుతున్నారు. కాల్స్ అన్నీ గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాలకు చెందిన ఫోన్ నంబర్లతో వస్తున్నాయి. వీరు చేసే ఈ ఫోన్లకు స్పందించి, వాళ్లు చెప్పిన మాటలు వింటే మోసపోవడమే కాకుండా నిలువునా దోపిడీకి గురయ్యే ప్రమాదముంది.

సైబర్ నేరగాళ్లు చేస్తున్న ఇలాంటి ఫోన్ కాల్స్‌తో అమాయకులు బలవుతున్నారు. కొందరు భయపడుతూ ఏమి జరుగుతుందోనని ఆయా కాలర్స్ ట్రాప్‌లో పడుతున్నారు. ఇలా ట్రాప్‌లో పడి భయపడేవాళ్లను లక్ష్యంగా చేసుకొని తాము పోలీసులమంటూ చెప్పి సైబర్ నేరగాళ్లు బెదిరింపులకు దిగుతున్నారు. కొందరిని డిజిటల్ అరెస్ట్ చేసి, ఆ తరువాత పరిశీలన పేరుతో బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ఈ విధంగా ప్రతి రోజూ వందల మందికి ఫోన్‌కాల్స్ చేస్తున్నారు. నేరగాళ్ల మాటలు నమ్మిన బాధితులు.. వారు చెప్పినట్టు చేసి చేతులు కాల్చుకుంటున్నారు. ఇలా దాదాపు వంద మందికి పైగా ఫోన్ చేస్తున్నారు. వీరిలో ఒకరిద్దరు అమాయకులు ఉంటే చాలు.. వారి ఖాతాలను నేరగాళ్లు ఖాళీ చేస్తున్నారు.

ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలి

- బహుళ అంతస్తుల నిర్మాణాలు, నాలాలు, నీటి వనరుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి
- పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, ఆగస్టు 20 (నమస్తే తెలంగాణ) : రహదారులపై నీరు నిలవడం వల్ల ప్రమాదాలు జరుగకుండా క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం అదనపు, జోనల్ కమిషనర్‌లతో ఆమ్రపాలి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధాన రహదారిపై ప్రాజెక్టు సైట్ వద్ద ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై మరమ్మతులు చేస్తున్న స్థలం వద్ద ప్రమాదాలు సంభవించకుండా.. భద్రతా చర్యల్లో భాగంగా బారికేడ్లు, హెచ్చరిక బోర్డులతో పాటు రాత్రి సమయంలో లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బహుళ అంతస్తుల నిర్మాణాలు, నాలాలు, నీటి వనరుల వద్ద కూడా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. మెహిదీపట్నం, హఫీజ్‌నగర్, అత్తాపూర్, గుడిమల్కాపూర్, విజయ్‌నగర్‌కాలనీ, మాసబ్ ట్యాంక్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వాటర్ లాగింగ్ పాయింట్లను కమిషనర్ పరిశీలించారు. వర్షాలతో ఏవైనా సమస్యలు వస్తే జీహెచ్ఎంసీ హెల్ప్ లైన్‌ను సంప్రదించాలని తెలిపారు. డ్రైన్ మ్యాన్‌హోల్స్ ఓపెన్ చేయవద్దని కమిషనర్ సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లను మేయర్ విజయలక్ష్మి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షితంగా ఉండాలని, సహాయానికి జీహెచ్ఎంసీ కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలని డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్ రెడ్డి సూచించారు. హుస్సేన్‌సాగర్ ఇన్‌ఫ్లో 1850 క్యూసెక్కులు కాగా, ఔట్‌ఫ్లో 2100 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఆమె తెలిపారు.

అన్ని పీజీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం , ఎంకాం (ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎమ్మెస్సీ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ అన్ని కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యూలర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 22 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. రూ.300 అపరాధ రుసుంతో 27 లోగా చెల్లించవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని ఆయన సూచించారు.

బీపీఎస్ఎల్‌పీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బీఏఎస్ఎల్‌పీ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును 27 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుంతో 30 వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంబీఏ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎంబీఏ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్) సెమిస్టర్ల రెగ్యూలర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బీఈ కోర్సుల మేకప్ పరీక్షా తేదీల మార్పు

ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల మేకప్ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (సీబీసీఎస్), బీఈ (ఏఐసీటీఈ), బీఈ (నాన్ సీబీసీఎస్) ఎనిమిదో సెమిస్టర్ మేకప్ పరీక్షలను ఈ నెల 28 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

రుణమాఫీపై ఆందోళన చెందవద్దు

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి



మొయినాబాద్ రైతు వేదికలో రుణమాఫీపై రైతులతో మాట్లాడుతున్న డీఏవో గీతారెడ్డి

మొయినాబాద్, ఆగస్టు 20 : రుణమాఫీ ప్రతి రైతుకూ జరుగుతుందని.. ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. మంగళవారం మొయినాబాద్ రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రైతులు, నాయకులు అడిగిన ప్రశ్నలకు, రైతులకున్న సందేహాలకు సమాధానాలు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం రెండు లక్షల వరకు రుణాలు మాఫీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది కాబట్టి.. రెండు లక్షలు అప్పు ఉన్న ప్రతి రైతుకూ రుణాలు మాఫీ అవుతాయని చెప్పారు. బ్యాంకు ఖాతాలో ఏమైనా తప్పులుంటే వాటిని సరి చేసి రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ డ్రైవ్‌లో రుణాలు మాఫీ కాని రైతుల నుంచి కావాల్సిన పత్రాలు తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎలాంటి కారణాల వల్లనైనా రుణాలు మాఫీకాని వారి విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ప్రతి రైతుకూ రుణాలు మాఫీ చేయడం